వడదెబ్బ నివారణకు చర్యలు తీసుకోండి

- కలెక్టర్ పమేలా సత్పతి
- తీగలగుట్టపల్లి బస్తీ దవాఖాన సందర్శన

బస్తీ దవాఖానను పరిశీలిస్తున్న కలెక్టర్

విద్యానగర్, ఏప్రిల్ 2: ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి వైద్యాధికారులకు సూచించారు. మంగళవారం కరీంనగర్ రూరల్ మండలం తీగలగుట్టపల్లిలోని బస్తీ దవాఖానను సందర్శించారు. చికిత్స కోసం వచ్చిన మహిళలతో మాట్లాడి వైద్య సేవలు ఎలా అందుతున్నాయని ఆరా తీశారు. మందులు ఇస్తున్నారా.. పోషకాహారం పై అవగాహన కల్పిస్తున్నారా.. అని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వడదెబ్బ నివారణకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. డాక్టర్ రూమ్, ల్యాబ్, వివిధ వార్డులను పరిశీలించారు. రోజు పేషెంట్లు ఎంతమంది వస్తారు.. వారికి అందిస్తున్న వైద్య సేవలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వైద్య పరీక్షల రిపోర్టుకు అవసరమైన ప్రింటర్, కంప్యూటర్‌ను అందిస్తానని, ఈ మేరకు ప్రతిపాదనలు పంపించాలని జిల్లా వైద్యాధికారిని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, డిప్యూటీ డీఎంహెచ్‌వో జువేరియా, పీవో ఎంహెచ్ఎన్ సనా జువేరియా, వైద్యాధికారులు లావణ్య, సాహితీ పాల్గొన్నారు.

'బండి' రైతుదీక్ష బూటకం

మాట్లాడుతున్న రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్‌సింగ్

- ఓట్ల కోసమే నాటకం
- చంద్రబాబు డైరెక్షన్‌లోనే రేవంత్ పాలన
- రాష్ట్ర సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్‌సింగ్

కార్పొరేషన్, ఏప్రిల్ 2: 'ఐదేండ్లు ఎంపీగా పదవి వెలగబెట్టిన బండి సంజయ్, రైతుల గురించి ఒక్క మాట మాట్లాడలేదు.. ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికల ముందర ఓట్ల కోసం రైతు దీక్ష పేరిట నాటకమడుతున్నడు.' అని రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్‌సింగ్ ధ్వజమెత్తారు. మంగళవారం కరీంనగర్‌లోని ఓ హోటల్‌లో విలేకరులతో మాట్లాడారు. బీజేపీ సర్కారు రైతు వ్యతిరేక చట్టాలను పార్లమెంట్‌లో ఆమోదించిన సందర్భంలో మిన్నకుండిపోయిన సంజయ్ వారిని అడ్డండపెట్టుకొని బూటకపు దీక్షలు చేపట్టడం విడ్డూరమన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మేడిగడ్డ పిల్లర్ల కుంగుబాటును సాకుగా చూపి కాళేశ్వరం నుంచి నీళ్లు వదలకపోతే సంజయ్ ఏ రోజైనా మాట్లాడినవా? కేసీఆర్ బయటకు వస్తేనే మీకు రైతులు గుర్తుకు వచ్చి దీక్షలు గుర్తు వచ్చాయా? అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డికి నీళ్లు పంపులు గుర్తుకు వచ్చాయన్నారు. దీనిని బట్టే రేవంత్‌రెడ్డి, బండి సంజయ్ ఒక్కటే అనేందుకు నిదర్శనం అని ఆరోపించారు. ఎంపీగా ఐదేళ్లు నియోజకవర్గానికి, రాష్ట్రానికి చేసింది ఏమీ లేదని, ఇప్పుడు ఏ ముఖం పెట్టుకొని ఓట్లడుగుతున్నాడని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ఆంధ్రా చంద్రబాబునాయుడి డైరెక్షన్‌లోనే పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. అక్కడ చంద్రబాబు బీజేపీతో పొత్తు పెట్టుకున్నారని, అందుకే రేవంత్‌రెడ్డి కూడా మోదీని బడే భాయ్ అన్నారని గుర్తు చేశారు. బీజేపీ, కాంగ్రెస్ రెండు ఒక్కటేనని, కలిసి నాటకాలు ఆడుతున్నాయని ధ్వజమెత్తారు. బీజేపీకి ఏ రోజు కూడా రైతులపై ప్రేమ లేదని, బండి సంజయ్ రైతులపై కపట ప్రేమ చూపుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో రైతుల గురించి చిత్తశుద్ధితో పని చేసేది ఒక్క కేసీఆర్ మాత్రమేనన్నారు. అందుకే బీఆర్ఎస్ పాలనలో ఎక్కడా కూడా పంటలు ఎండిపోయే పరిస్థితి రాలేదన్నారు. ఈ సారి కాంగ్రెస్, బీజేపీ బండి సంజయ్ ఎన్ని వేషాలు వేసినా ఈ ఎన్నికల్లో గెలిచేది లేదన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్ భారీ మెజారిటీతో గెలువడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు గుంజపడుగు హరిప్రసాద్, పెండ్యాల మహేశ్‌కుమార్, తిరుపతి పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్‌కు రైతు సమస్యలపై వినతిపత్రం అందిస్తున్న బీఆర్ఎస్ జిల్లా నాయకులు

ఎండిన పంటకు పరిహారం ఇవ్వాలి

- కలెక్టర్‌కు బీఆర్ఎస్ నాయకుల వినతి

కార్పొరేషన్, ఏప్రిల్ 2: ఎండిన పంటలకు ఎకరాకు రూ. 25 వేల చొప్పున పరిహారం ఇవ్వాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్, మైనార్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్లు రవీందర్‌సింగ్, అక్బర్‌హుస్సేన్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ కలెక్టర్ పమేలా సత్పతికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సాగునీరందక, కరెంట్‌లేక పంటలు ఎండుతుండడంతో రైతులు నిండా మునిగారన్నారు. ఇది వచ్చిన కరువు కాదని, తెచ్చిన కరువు అని పేర్కొన్నారు. ధాన్యం క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వోడ్నాల రాజు, గుంజపడుగు హరిప్రసాద్, కెమసారం తిరుపతి, సుకూర్, మధుసూదన్‌రెడ్డి, అనిల్ పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలు ఇవ్వకుంటే మిగిలేది ఆరుగురే

- రైతుదీక్షలో కరీంనగర్ ఎంపీ బండి సంజయ్

విద్యానగర్, ఏప్రిల్ 2: కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు అమలు చేయకుంటే ఆ పార్టీలో మిగిలేది ఆరుగురే..అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ ఎద్దేవా చేశారు. మంగళవారం కరీంనగర్‌లో ఒక్కరోజు రైతుదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు, రైతుల పక్షాన దీక్షలు, ధర్నాలు, చేయడం మాకు కొత్త కాదన్నారు. వంద రోజుల్లో 6 గ్యారంటీలను అమలు చేస్తామని మోసం చేసిన కాంగ్రెస్, రూ.600 కోట్లతో మీడియాలో యాడ్స్ ఇస్తూ ప్రచారం చేసుకోవడం సిగ్గు చేటన్నారు. పంటలు ఎండి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేల పరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

రైతు దీక్షలో ఎంపీ బండి సంజయ్‌కుమార్

పోలీస్ కమిషనరేట్‌లో సైబర్‌క్రైమ్ ఠాణా

రాంనగర్, ఏప్రిల్ 2: కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లోని పోలీస్ హెడ్ క్వార్టర్‌లో ఏర్పాటు చేసిన సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్ సేవలు మంగళవారం నుంచి అందుబాటులోకి వస్తాయని సీపీ అభిషేక్ మొహంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌హెచ్‌వోగా ఏసీపీ నర్సింహారెడ్డిని నియమించామని పేర్కొన్నారు. సైబర్ మోసాలకు గురైన బాధితులు సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్‌లో నేరుగా, టోల్ ఫ్రీ నంబర్ 930 ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. సైబర్ నేరాల నియంత్రణకు కమిషనరేట్ పరిధిలోని అన్ని ఠాణాల్లో సైబర్ వారియర్స్ టీం ను ఏర్పాటు చేశామన్నారు.

'రంజాన్'కు ఏర్పాట్లు

జమ్మికుంట, ఏప్రిల్ 2: పట్టణంలోని ఖబ్రస్థాన్‌లో రంజాన్ సందర్భంగా ముస్లింల ప్రార్థన కోసం మున్సిపల్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం ఏర్పాట్లను చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు పరిశీలించారు. ఖబ్రస్థాన్‌లోని చెత్తాచెదారం, చెట్లను ఎక్స్‌కవేటర్, సిబ్బందితో తొలగించారు. స్థలాన్ని చదును చేయించారు. ఇక్కడ మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

పాపన్న గుట్టలను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

సైదాపూర్: పాపన్న విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

- మంత్రి పొన్నం ప్రభాకర్
- కొమ్ముగుట్ట వద్ద సర్వాయి పాపన్న వర్ధంతికి హాజరు

సైదాపూర్, ఏప్రిల్ 2: సర్దార్ సర్వాయిపాపన్న గుట్టలను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. మంగళవారం సైదాపూర్ మండలం సర్వాయిపేట శివారులోని కొమ్ముగుట్ట వద్ద నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతి కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతంలో సర్వాయిపాపన్న గుట్టలను సందర్శించారని, నాడు పర్యాటకకేంద్రంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారన్నారు. పాపన్నగుట్టలను పర్యాటక కేంద్రంగా చేసే విషయంపై సీఎంతో చర్చిస్తానన్నారు. అనంతరం గొడిశాల గ్రామానికి చెందిన ఆర్మీ జవాను నెల్లి రామకృష్ణ ఇటీవల మృతిచెందగా, ఆయన కుటుంబ సభ్యులను మంత్రి పొన్నం ప్రభాకర్ పరామర్శించారు. మండలంలో పర్యటన ముగించుకొని కరీంనగర్‌కు బయలు దేరిన మంత్రి.. వెన్కేపల్లి జిల్లా పరిషత్ పాఠశాల వద్ద విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలో సమస్యలున్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దొంత సుధాకర్, నాయకులు, గౌడసంఘం నాయకులు ఉన్నారు.

జిల్లావ్యాప్తంగా పాపన్నకు ఘన నివాళి

సైదాపూర్/ హుజూరాబాద్ టౌన్/ మానకొండూర్ రూరల్/ వీణవంక/ చిగురుమామిడి, ఏప్రిల్ 2: సర్వాయిపాపన్నగౌడ్ వర్ధంతిని గౌడ సంఘాల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. సైదాపూర్, హుజూరాబాద్, వీణవంక, మానకొండూర్ మండలం గంగిపల్లి, చిగురుమామిడి, బొమ్మనపల్లిలో నాయకులు, ప్రజాప్రతినిధులు పాపన్న గౌడ్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

నేటి నుంచి పదో తరగతి మూల్యాంకనం

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 2 : పదో తరగతి మూల్యాంకనం బుధవారం నుంచి నగరంలోని సేయింట్ జాన్స్ పాఠశాలలో ప్రారంభం కానుంది. ఇందు కోసం జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయులకు విధులు కేటాయించారు. ఈ క్రమంలో అసిసెంట్ ఎగ్జామినర్లుగా 563 మందిని, చీఫ్ ఎగ్జామినర్లుగా 94 మందిని, స్పెషల్ అసిస్టెంట్లుగా 188 మందిని నియమిస్తూ జిల్లా విద్యాశాఖాధికారి ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ విధులకు హాజరుకాని వారిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, ఏప్రిల్ 2: నగరంలోని 11కేవీ శ్రీరాం నగర్ ఫీడర్‌లో విద్యుత్ తీగెల కింద ఉన్న చెట్ల కొమ్మలు తొలగిస్తున్నందున బుధవారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు శ్రీరాంనగర్, కొత్త యాస్వాడ, ఆదిత్య నగర్, యూనివర్సిటీ ఏరియాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-2 ఇన్‌చార్జి ఏడీఈ సాయినేని నరేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

విషయ పరిజ్ఞానానికి సదస్సులు దోహదం

మాట్లాడుతున్న వీసీ మల్లేశ్ సంకశాల

- శాతవాహన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ మల్లేశ్ సంకశాల
- వివేకానందలో అట్టహాసంగా మేనేజ్‌మెంట్ మీట్

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 2 : నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు సదస్సులు ఎంతో దోహదపడతాయని శాతవాహన యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ మల్లేశ్ సంకశాల తెలిపారు. జిల్లా కేంద్రంలోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం 'సూరి జనరిస్ 2024' పేరిట బీబీఏ, ఎంబీఏ విద్యార్థుల కోసం ఒక రోజు మేనేజ్‌మెంట్ మీట్ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని వీసీ, శాతవాహన యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్‌వీ శ్రీరంగ ప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీహెచ్ శ్రీనివాస్, కార్యక్రమ నిర్వాహకుడు బిజినెస్ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ కిరణ్‌కుమార్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం వీసీ మల్లేశ్, డాక్టర్ ఎన్‌వీ శ్రీరంగ ప్రసాద్ మాట్లాడుతూ, మేనేజ్‌మెంట్ విద్యార్థులు ఎల్లప్పుడూ కొత్త కొత్త విషయాలను పరిశోధించి విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పీహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ, వివేకానంద కళాశాల ఎల్లప్పుడూ ఇలాంటి సదస్సులు నిర్వహించడంలో ముందుంటుందని, ఇలాంటి అవకాశాలను విద్యార్థులు ఉపయోగించుకోవాలని సూచించారు. సదస్సు కన్వీనర్ డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ, ఈ సదస్సులో బీబీఏ విద్యార్థుల కోసం 16 రకాల పోటీలు, ఎంబీఏ విద్యార్థుల కోసం 15 రకాల పోటీలను ఆన్‌లైన్ ద్వారా నిర్వహించినట్లు చెప్పారు. ఈ సదస్సులో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పది కళాశాలల నుంచి 304 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు వివరించారు. ఇక్కడ కళాశాల అధ్యాపకులు, వివిధ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సాయంత్రం బహుమతుల ప్రదానం చేశారు.

రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

మాట్లాడుతున్న బీఆర్ఎస్‌వై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావుల రాజలింగారెడ్డి

హుజూరాబాద్ టౌన్, ఏప్రిల్ 2: మిల్లర్లతో సంబంధం లేకుండా వడ్లను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని గతంలో కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, ఇచ్చిన మాట ప్రకారం కొనుగోళ్లు చేపట్టాలని బీఆర్ఎస్‌వై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావుల రాజలింగారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన హుజూరాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ... గత నెలలో కురిసిన అకాల వర్షాలతో జరిగిన పంట నష్టం అంచనా వేసి ఎకరాకు రూ. 10 వేలు అందిస్తామన్న రాష్ట్ర ప్రభుత్వం, ఇంతవరకు రైతులకు పరిహారం ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. తక్షణమే పూర్తి స్థాయిలో వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడంతోపాటు క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కొన్ని చోట్ల సరైన సమయంలో సాగు నీరు విడుదల చేయకపోవడంతో పంటలు ఎండిపోయాయని, తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు. ఎన్ని కల్లో ఇచ్చిన హామీ మేరకు రైతు కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, సమగ్ర పంటల బీమాను రైతులతో పాటు రైతు కూలీలకు సైతం వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కే సమ్మయ్య, పీ సదానందం, రవి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారార్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 2 : జిల్లా కేంద్రంలోని ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాల హిందీ విభాగం విద్యార్థులు హైదరాబాద్ నాంపల్లిలోని ఇందిరా ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా కళాశాలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి జిజ్ఞాస పోటీల్లో ప్రతిభ చూపారు. ఇటీవల కళాశాల హిందీ విద్యార్థులు రూపొందించిన 'సోషల్ మీడియాలో హిందీ భాష : ఒక అధ్యయనం' (వాట్సాప్, ఫేస్ బుక్‌లకు ప్రత్యేకంగా) అంశంపై చేసిన స్టూడెంట్ స్టడీ ప్రాజెక్ట్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. డాక్టర్ వరప్రసాద్ వాసాల పర్యవేక్షణలో జరిగిన ఈ స్టూడెంట్ స్టడీ ప్రాజెక్ట్‌ను మహ్మద్ ముజ్జబా, మహ్మద్ ఆసిఫ్, షేక్ షర్జీల్, సయ్యద్ ఖాజా మొయినుద్దీన్, సర్దార్ మన్‌ప్రీత్ సింగ్ తదితరులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమర్థవంతంగా వివరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే రామకృష్ణ, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ టీ రాజయ్య, స్టాఫ్ సెక్రటరీ డాక్టర్ ఎ శ్రీనివాస్ తదితరులు హిందీ విభాగం అసిస్టెంట్ హిందీ ప్రొఫెసర్ డాక్టర్ వరప్రసాద్ వాసాలను, విద్యార్థులను అభినందించారు.

కట్టుకున్న వాడు కాదన్నాడని..

రేయాన్స్ అలియాస్ ఆర్విన్

మొగ్దుంపురం శ్రీజ

గద్దె జయప్రద

- ఏడాది కొడుక్కు విషం ఇచ్చి.. ఆపై ఆత్మహత్య
- కూతురు, మనుమడు చనిపోయాడని అమ్మమ్మ బలవన్మరణం
- కరీంనగర్‌రూరల్ మండలం బొమ్మకల్‌లో విషాదం

రాంనగర్, ఏప్రిల్ 2: కట్టుకున్న భర్త వేధించడంతో పుట్టింటికి చేరిన ఓ తల్లి కొడుకు మొదటి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించుదామని అడగడంతో ససేమిరా అన్నాడు. భర్త వైఖరికి మనస్తాపం చెందిన తల్లి ఏడాది పూర్తికాని కొడుక్కు విష గుళికలు ఇచ్చి, తాను ఆత్మహత్య చేసుకుంది. కూతురు, మనుమడు చనిపోవడం జీర్ణించుకోలేని ఆమె తల్లి కూడా బలవన్మరణం చేసుకున్నది. కరీంనగర్‌రూరల్ మండలం బొమ్మకల్ గ్రామంలో మంగళవారం జరిగిన ఈ హృదయ విదారక ఘటన వివరాలిలా ఉన్నాయి. బొమ్మకల్ గ్రామంలోని విజయనగర్ కాలనీలో నివాసం ఉంటున్న గద్దె వెంకటేశ్వర్-జయప్రద దంపతులకు ఇద్దరు కూతుళ్లు. రెండో కూతురు శ్రీజ(32)కు వరంగల్‌కు చెందిన మొగ్దుంపురం నరేశ్‌తో మూడేళ్ల క్రితం వివాహమైంది. నరేశ్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుండగా, వారికి కొడుకు రేయాన్స్ అలియాస్ ఆర్విన్ (11 నెలల 25 రోజులు) ఉన్నాడు. అత్తింట్లో గొడవలు కావడంతో నాలుగు రోజుల క్రితం శ్రీజ, కొడుకును ఆమె తల్లిదండ్రులు ఇంటికి తీసుకువచ్చారు. మంగళవారం ఉదయం భర్త నరేశ్‌తో ఫోన్‌లో మాట్లాడగా, బాబు పుట్టిన రోజు విషయంలో చర్చ జరిగింది. పుట్టిన రోజుకు నరేశ్ కుటుంబ సభ్యులు రామని చెప్పడంతో శ్రీజ మనోవేదనకు గురైంది. దీంతో ఇంట్లో ఉన్న విషగుళికలు కలిపిన నీటిని తన కొడుక్కు తాగించి, ఆమె కూడా తాగింది. వారు స్పృహ తప్పిపడిపోయిన విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అప్పటికే బాబు చనిపోగా, శ్రీజను మెరుగైన చికిత్స కోసం అపోలో దవాఖానకు తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో ఆమె చనిపోయింది. కూతురు, మనుమడు చనిపోవడంతో మనోవేదన చెందిన శ్రీజ తల్లి జయప్రద ఇంట్లో ఉన్న విషగుళికల మందు తాగింది. కుటుంబ సభ్యులు ఈమెను కూడా అపోలో దవాఖానకు తరలించగా, పరిస్థితి విషమించి మంగళవారం సాయంత్రం మృతి చెందింది. కాగా, జయప్రద బొమ్మకల్ ప్రభుత్వ పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్నది. వెంకటేశ్వర్ ఫిర్యాదు మేరకు శ్రీజ భర్త నరేశ్, అత్తమామ సుజాత, కేశవాచారిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్ కుమార్ తెలిపారు.

రైతులను ఆదుకోవాలి

హుజూరాబాద్ రూరల్, ఏప్రిల్ 2: రాష్ట్రంలో నీళ్లందక వేల ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎకరానికి రూ.30 వేల చొప్పున పరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని బీఆర్ఎస్ యూత్ నియోజకవర్గ ఇన్‌చార్జి తొగరు శివకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అలాగే మిగిలిన పంటలు ఎండకుండా నీటిని విడుదల చేయాలని కోరారు. యాసంగి సీజన్ రైతు బంధు డబ్బులు ఇంకా రైతుల ఖాతాల్లో జమ కాలేదని, కౌలు రైతులకు సైతం 'రైతు బంధు' ఇవ్వాలని డిమాండ్ చేశారు.

స్టాక్ వివరాల నమోదు తప్పనిసరి

ఇల్లందకుంట, ఏప్రిల్ 2: ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో తప్పక నమోదు చేయాలని హుజూరాబాద్ ఏడీఏ సునీత ఫర్టిలైజర్ షాపుల నిర్వాహకులకు సూచించారు. మంగళవారం మండలంలోని సీతంపేట, ఇల్లందకుంట, కనగర్తి, లక్ష్మాజీపల్లి, మల్యాల గ్రామాల్లో ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. దుకాణాల నిర్వాహకులకు పలు సూచనలిచ్చారు. ఆమె వెంట ఏఈవోలు సంపత్, రాకేశ్, తిరుపతి, డీలర్లు ఉన్నారు.

'ఉపాధి' పని కూలి రేట్లు పెంచాలి

తిమ్మాపూర్ రూరల్, ఏప్రిల్ 2: ఉపాధిహామీ కూలీలు శ్రమ దోపిడీకి గురవుతున్నారని, ప్రభుత్వం వెంటనే కూలి రేట్లు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్ కుమార్ డిమాండ్ చేశారు. ఇందిరానగర్‌లో మంగళవారం ఉపాధిహామీ పనులను ఆయన పరిశీలించారు. కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వేసవి దృష్ట్యా ఉపాధిహామీ పని స్థలాల్లో కూలీలకు అన్ని సౌకర్యాలు కల్పించడంతోపాటు, ఓఆర్ఎస్ ప్యాకెట్స్ పంపిణీ చేయాలన్నారు. అలాగే పనులను ఉదయం 7 నుంచి 11 గంటల వరకే కొనసాగించాలని, దూర ప్రాంతాలకు వెళ్లే కూలీలకు రవాణా సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి బోయిని తిరుపతి, డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు శంకర్, నాయకులు మల్లారెడ్డి, అంజయ్య, రాజవ్వ, లచ్చవ్వ, మాధవి, శైలజ, శోభారాణి, మల్లక్క, రజిని పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుడు మృతి

హుజూరాబాద్ రూరల్/ టౌన్, ఏప్రిల్ 2: గత నెల 30న సింగాపూర్ కిట్స్ కాలేజీ ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన హుజూరాబాద్ పట్టణానికి చెందిన ఇజ్జగిరి అఖిల్ (22) హనుమకొండలో ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. అఖిల్ తండ్రి వీరన్న ఫిర్యాదు మేరకు హుజూరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు. చేతికి అందివచ్చిన కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

కటిక సేవ సంఘం నూతన కార్యవర్గం

కటిక సేవ సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

హుజూరాబాద్‌టౌన్, ఏప్రిల్ 2: హుజూరాబాద్ పట్టణ కటిక సేవ సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం గౌరవాధ్యక్షుడిగా కోయల్‌కార్ రమేశ్, అధ్యక్షుడిగా మిర్యాలకార్ చందాజీ, ఉపాధ్యక్షుడిగా కోయల్‌కార్ దుర్గాజీ, కార్యదర్శిగా కోయల్‌కార్ బాలాజీ, సంయుక్త కార్యదర్శిగా రావులకార్ యాదగిరి, కోశాధికారిగా కోయల్‌కార్ శ్రీనివాస్, ప్రచార కార్యదర్శులుగా జమాల్‌పూర్ అనిల్, కోయల్‌కార్ సాయిరాంతో పాటు ముఖ్య సలహాదారులుగా కోయల్‌కార్ శ్రీనివాస్, గోగికారి తుక్కాజీ, జమాల్‌పూర్ సంతోష్, అంకార్ రమేశ్, కోయల్‌కార్ శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

ప్రతిభావంతులైన విద్యార్థులకు అభినందన

గంగాధర, ఏప్రిల్ 2: చొప్పదండి సవోదయ విద్యాలయంలో సీటు సాధించిన కావిరెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని పారునంది అక్షితను మంగళవారం మాజీ సర్పంచ్ జోగు లక్ష్మీరాజు, ఎంఈవో వేణుకుమార్, హెచ్ఎం వెంకటేశ్వర్లు, టీచర్ లచ్చయ్య, నోడల్ అధికారి ప్రభాకర్‌రావు, కాంప్లెక్స్ హెచ్ఎం ప్రభావతి, గ్రామస్తులు అభినందించారు. అక్షితను తోటి విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

గన్నేరువరం, ఏప్రిల్ 2: మండల కేంద్రంలోని విజ్ఞాన్ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు మణిహర్ష, గడ్డం ఆరుషి రెడ్డి నవోదయ ఎంట్రెన్స్ ఎగ్జామ్‌లో ఉత్తీర్ణులై, ప్రవేశానికి అర్హత సాధించారని పాఠశాల కరస్పాండెంట్ బూర వెంకటేశ్వర్, ప్రిన్సిపాల్ భాను చైతన్య మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను వారితో పాటు వైస్ ప్రిన్సిపాల్ లత, ఉపాధ్యాయులు అభినందించారు.

లాభాల బాటలో కేడీసీస